క్లుప్తంగా

ఎన్ఎంఎంఎస్‌లో శ్రీరంగపట్నానికి ద్వితీయ స్థానం


వెంకటేశ్వరరావు, హెచ్ఎం

మధురపూడి: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)లలో కోరుకొండ మండలం శ్రీరంగపట్నం హైస్కూల్ ద్వితీయ స్థానం దక్కించుకున్నట్టు ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది తొమ్మిదో తరగతి విద్యార్థినులు మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారన్నారు. జిల్లాలో అనపర్తి బాలికల పాఠశాల ప్రథమ స్థానం, శ్రీరంగపట్నానికి ద్వితీయస్థానం వచ్చిందన్నారు.

ఘనంగా ఆజాద్ జయంత్యుత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంత్యుత్సవాన్ని సోమవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ మాట్లాడుతూ ఆజాద్ మహోన్నత వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. తెలుగు అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ సుధామయి మాట్లాడుతూ అనేక భాషల్లో పండితుడైన మౌలానా తన విజ్ఞానాన్ని, మేధస్సును దేశం కోసం వినియోగించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కోరుకొండ హైస్కూల్లో తాగునీటి కొరత


కోరుకొండ హైస్కూల్లో ఏర్పాటు చేసిన వాటర్ టిన్నులు

మధురపూడి: కోరుకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటికి కొరత ఏర్పడింది. ఇక్కడ 720 మంది విద్యార్థులతో పాటు 27 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. ఈ పాఠశాలకు పంచాయతీ నుంచి నీటి సరఫరా జరగడం లేదు. అలాగే రక్షిత నీరందించే ట్యాంకర్లు కూడా రావడం లేదు. దీంతో విద్యార్థులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. అయితే టిన్నుల్లో నీటిని తీసుకువచ్చి పాఠశాలలో పెడుతున్నారు. కానీ అవి విద్యార్థులకు పూర్తిస్థాయిలో సరిపోవడం లేదు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రక్షిత నీరందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాదిగ ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికి పిలుపు


వడిశలేరులో మాదిగలతో మాట్లాడుతున్న వీరబాబు

రంగంపేట: నవంబర్ 21న రాజమహేంద్రవరంలో నిర్వహించే మాదిగ ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని అనపర్తి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ కొమ్ముకూరి వీరబాబు మాదిగ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాదిగల ఉద్యమ పోరాటం ఫలితంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన సంచలన తీర్పు ద్వారా ఎస్సీ వర్గీకరణ సాధించి మొదటి సారిగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సమ్మేళ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని మండలంలోని వడిశలేరు, ముకుందవరం, ఈలకొలను, ఎస్టీరాజాపురం గ్రామాలలో పర్యటించి మాదిగ కులస్తులను కోరడం జరిగిందన్నారు. అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరి రవికుమార్ మాదిగ పాల్గొన్నారు.

రెవెన్యూ సభకు 55 ఫిర్యాదులు

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సభలో రైతులు వివిధ సమస్యలపై 55 దరఖాస్తులు అందజేసినట్టు తహసీల్దార్ సుస్వాగతం తెలిపారు. భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి ఈ సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ అంబటి రజని, మధురపూడి వీఆర్వో కోనా ప్రసాద్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చొరవ చూపితే ఆదాయమే!

- నిరుపయోగంగా సంపద కేంద్రాలు
- నిధులు చెత్తపాలు
- పట్టించుకోని అధికారులు

రంగంపేట: చెత్త నుంచి సంపద సృష్టించి వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగిస్తామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. కనీసం వాటి గురించి నోరు మెదపడం లేదు. దీంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఈ కేంద్రాల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేశారు. బ్యాటరీ బండ్లు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లు, జనాభా ఎక్కువ ఉంటే ట్రాక్టర్, గాజు సీసాలు పొడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యంత్రాలు కేటాయించింది. ఈ కేంద్రాల్లో పని చేసేందుకు గత ప్రభుత్వం క్లీన్ మిత్రలను కూడా నియమించింది. వీరు వీధుల నుంచి చెత్తను సేకరిస్తారు. తడి, పొడి చెత్తతో పాటు గాజు, పెంకు, ప్లాస్టిక్‌లుగా వేరు చేస్తారు. వాటిని వేర్వేరు తొట్టెల్లో వేసి కుళ్లించి వాన పాములతో సేంద్రియ ఎరువులు తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక్కడ తయారైన ఎరువును ప్యాకెట్లుగా తయారు చేసి రైతులకు విక్రయించాలి. కిలో కంపోస్టు ఎరువు రూ.8 నుంచి రూ.10 వరకు విక్రయిస్తే ఆదాయం సమకూరుతుంది. తయారైన ఎరువులను రైతులకు విక్రయించాలని పెట్టుకున్న లక్ష్యం నీరు గారింది. సంపద తయారీ కేంద్రాలు షెడ్లకే పరిమితమయ్యాయి. గ్రామాల నుంచి చెత్తను సేకరించి వానపాముల ద్వారా ఎరువుల తయారీ పడకేసింది. మురుగు కాలువలు, వీధుల్లో చెత్త, ప్లాస్టిక్, గాజు సీసాలు పేరుకుపోతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు.

ప్రజా ధనం వృథా

కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో అవి మందుబాబులకు స్థావరాలుగా మారాయి. గ్రామాలకు కొంత దూరంలో ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. కొన్నిచోట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రంగంపేట మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో చెత్త నుంచి సంపద కేంద్రాలు ఏర్పాటుకు స్థల సేకరణ చేసి రూ.54.87 కోట్లు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు చేపట్టడంపై ఉన్న శ్రద్ధ వాటిని వినియోగంలోకి తీసుకురావడంపై లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కొన్ని కేంద్రాలు శిథిలమైపోయాయి. దీంతో కోట్లు ఖర్చు చేసినా ఆదాయం రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిపై చొరవ తీసుకోవలసిన అవసరం ఉంది. చెత్త నుంచి సంపద కేంద్రాలను పర్యవేక్షించాలి. చెత్త నుంచి ఆదాయం పెంచుకుని ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పెదరాయవరంలో నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం


రంగంపేటలో శిథిలావస్థకు చేరిన సంపద కేంద్రం

రంగంపేట మండలంలో పంచాయతీల వారీగా వివరాలు

సంఖ్య	పంచాయతీ	నిర్మాణం స్థితి	ఖర్చు చేసిన నిధులు రూ.లక్షల్లో
1.	దొడ్డిగుంట	పూర్తి	4.61
2.	ఈలకొలను	పూర్తి	2.30
3.	జి.దొంతమూరు	పూరి	2.44
4.	కోటపాడు	పూర్తి	4.13
5.	ముకుందవరం	పూర్తి	1.38
6.	నల్లమిల్లి	పూర్తి	4.92
7.	పెదరాయవరం	పూర్తి	4.66
8.	రంగంపేట	పూర్తి	3.87
9.	ఎస్టీరాజాపురం	పూర్తి	5.04
10.	సింగంపల్లి	పూర్తి	6.43
11.	సుభద్రంపేట	పూర్తి	5.46
12.	వడిశలేరు	పూర్తి	3.07
13.	వెంకటాపురం	పూర్తి	4.12
14.	వీరంపాలెం	ఇన్‌ప్రోగ్రస్	2.44
15.	చంద్రేడు	ఇన్‌ప్రోగ్రస్	----
16.	మర్రిపూడి	మంజూరు కాలేదు	---
17.	పాత వీరంపాలెం	మంజూరు కాలేదు	-----

వినియోగంలోకి తేవాలి



చెత్త నుంచి సంపద తయారీ చేసేందుకు షెడ్లను నిర్మించడం బాగుంది. అయితే ఇవి నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి. ఎరువుల తయారీకి ప్రణాళికలు రూపొందించాలి. వర్మీ కంపోస్టును తయారు చేసి, స్థానికంగా ఉండే రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేయాలి.
కె.సత్యనారాయణ, ఎస్టీ రాజాపురం, రంగంపేట మండలం

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మండలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో త్వరలో పనులు ప్రారంభిస్తాం. కేంద్రాల్లో ఎరువుల తయారీని ప్రారంభించి, పంచాయతీలకు ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం.
పి. వెంకటరత్నం, ఈఓపీఆర్డీ, రంగంపేట మండలం.

ఘనంగా కార్తిక వనసమారాధన

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడితమామిడి వద్ద కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్థిక సహకారం అందించిన దాత కొంకుదురు గ్రామానికి చెందిన కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డిని ఆలయ కమిటీ అభినందించింది.

అన్న సమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరులోని భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే తనయుడు పెందుర్తి అభిరామ్ అన్న సమారాధనను నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన వందల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్తిక మాసంలో ఆలయంలో అన్న సమారాధనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి.

డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని అర్జీ

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక అర్జీ అందింది. రఘుదేవపురానికి చెందిన సుంకర పోశియ్య తన డ్రైవింగ్ లైసెన్స్ కాలపరిమితి ముగిసింది, దాన్ని రెన్యూవల్ చేయడానికి వెళ్లితే డేటా లేదంటున్నారని, తనకు డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందించాడు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా


గాదరాడలో బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

మధురపూడి: మండలంలోని గాదరాడలో సోమవారం ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. గ్రామంలోని కనకదుర్గమ్మ గుడి వద్ద ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ నుంచి పెద్దాపురం మండలం కాండ్రకోటకు ఇసుక ట్రాక్టర్ వెళుతోంది. అతివేగం కారణంగా గాదరాడలోని దుర్గమ్మ గుడి వద్ద ఆగి ఉన్న ఆటోను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆటోలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా.. ఇసుక ట్రాక్టర్లు అత్యంతగా వేగంగా వెళుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నన్నయలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు


వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ (మెన్ అండ్ ఉమెన్) పోటీలు సోమవారం జరిగాయి. పురుషుల విభాగంలో పీఆర్ డిగ్రీ కళాశాల (కాకినాడ), మహిళల విభాగంలో అన్నవరం సత్యదేవి మహిళ డిగ్రీ కళాశాల (కాకినాడ) ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించాయి. అనంతరం గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే క్రీడాకారుల జట్టును రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ సంఘం ఉపాధ్యక్షులు బాడేటి వెంకటరామయ్య, భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

బోధనపై ఆసక్తి చూపితే మంచి ఫలితాలు


మాట్లాడుతున్న జీవీఎస్ ప్రసాద్

రాజానగరం: ఉపాధ్యాయుడు పాఠాలను ఆసక్తిగా బోధిస్తే విద్యార్థులకు ఎక్కువ కాలం జ్ఞాపకం ఉంటాయని ప్రముఖ మోటివేటర్, సింగరేణి కోల్లరీస్ విశ్రాంత డీజీఎం జీవీఎస్ ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ బొమ్మూరు సెంటీనియల్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమేష్‌బాబు ఆధ్వర్యంలో మండలంలోని పుణ్యక్షేత్రం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, జూనియర్ ఇంటర్ విద్యార్థులకు లిజనింగ్ స్కిల్స్ (వినే నైపుణ్యాలు)పై సోమవారం మోటివేషన్ క్లాస్ (ప్రేరణ తరగతి) నిర్వహించారు. మనిషి ఇక్కడ, మనస్సు ఎక్కడో అన్నట్టుగా తరగతి గదిలో కూర్చుంటే ఉపాధ్యాయుడు చేసే బోధన గాలిలో కలిసిపోతుందన్నారు. ఆ బోధన విద్యార్థి బుర్రకు చేరితేనే ఉభయులకు ఫలితం ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. చదవడం, రాయడం, చెప్పడం, వినడంలోనే అంతర్జాతీయ ప్రమాణాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులందరికీ పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అడ్మిన్ బోను రాము, హెచ్ఎం ఎస్.తాతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులతో జిల్లా ప్రెసిడెంట్ ముప్పన వీరభద్రస్వామి

బిక్కవోలు: అంతర్ జిల్లాల సీనియర్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న తూర్పుగోదావరి జిల్లా మహిళల జట్టు క్రీడాకారులను బాల్ బ్యాడ్మింటన్ జిల్లా ప్రెసిడెంట్ యుప్పన వీరభద్రస్వామి అభినందించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన అంతర్ జిల్లాల సీనియర్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల ఫైనల్‌లో విశాఖ జిల్లాపై విజయం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్రీడాకారుల్లో ఐదుగురు క్రీడాకారులు బిక్కవోలు చెందిన క్రీడాకారులు కావడం మరో విశేషం అన్నారు. పీఈటీలు చైతన్య కుమార్‌రెడ్డి, నరేంద్ర, జే మోహన్ రావు, బిక్కవోలు బాల్ బ్యాడింటన్ ప్రెసిడెంట్ శశిభూషణం, చైర్మన్ ఉప్పల్ వీర్రాజు, జిల్లా సెక్రెటరీ సీతాపతి, వీకేర తంబి తదితరులు అభినందించారు.

లాలాచెరువు పాఠశాల సందర్శన

ప్రకాశం నగర్: ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ (ఎఫ్ఎస్ఆర్పీ) 99వ ఫౌండేషన్ కోర్సులో భాగంగా 11 మంది ట్రైనీ ఐఏఎస్‌లు సోమవారం లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల విద్యకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. అక్కడ నిర్మించిన లైబ్రరీ భవనం, దానిలోని డిజిటల్ పుస్తకాలు, లైబ్రరీని విద్యార్థులు వినియోగించుకుంటున్న విధానాన్ని తెలుసుకున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వినియోగిస్తున్న ఫ్లాట్ ప్యానెల్ బోర్డు పనితీరును పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో అందిస్తున్న మెనూ గురించి అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కందికొండ రమేష్, నగరపాలక సంస్థ డీఈ పి.ప్రసాద్, లైజనింగ్ అధికారి రవికుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


సీతానగరం శివాలయంలో భక్తుల రద్దీ

సీతానగరం: కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక రేవుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సీతానగరంలో ఉమా రామలింగేశ్వరస్వామి, ముగ్గళ్లలో ఉమా కోమరేశ్వరస్వామి, మునికూడలిలో ఉమా సోమేశ్వరస్వామి దేవాలయాల్లో తెల్లవారుజాము మూడు గంటల నుంచే భక్తుల రద్దీ నెలకొంది.

మహాదేవా..పాపవినాశ

- ఘనంగా కార్తికమాసం రెండో సోమవారం పూజలు
- ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు

బిక్కవోలు: కార్తికమాసం రెండో సోమవారం కావడంతో ఆలయాల్లో శివనామం మార్మోగింది. బిక్కవోలు శ్రీగోలింగేశ్వర స్వామి, ఊలపల్లి కేదారేశ్వరస్వామి, కొంకుదురు బుడతలమామిడి వద్ద ఉన్న త్రిముఖలింగేశ్వర స్వామి, పందలపాక కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి తదితర ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

మార్మోగిన శివనామం

రంగంపేట: కార్తికమాసం రెండో సోమవారం పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పరమేశ్వరుడిని దర్శించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రంగంపేట గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మండలంలోని వడిశలేరు, పెదరాయవరం, సింగంపల్లి, సుభద్రంపేట, ముకుందవరం, జి.దొంతమూరు గ్రామాల్లోని పురాతన శివాలయాలకు గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని వినాయక నగర్‌లో కొలువైన శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గరిమెళ్ల పవన్ ఆధ్వర్యంలో 12 మంది రుత్వికులతో లక్ష బిల్వార్చన నిర్వహించారు. కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం దీపాలంకరణ చేశారు. శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకులు గరిమెళ్ల సత్యప్రకాష్ ఆధ్వర్యంలో, కొంకుదురు శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకులు రమణశర్మ ఆధ్వరంలో లక్ష బిల్వార్చన చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారధన నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.


పెదపూడిలో శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు


పందలపాక వినాయకనగర్‌లో లక్ష బిల్వార్చనలో భక్తులు

పెదపూడి: అనపర్తి మండలంలో శివాలయాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి. అనపర్తి పాత ఊరులో ప్రసిద్ధి చెందిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తికమాసం రెండో సోమవారం పురస్కరించుకుని వేకువ జాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అర్చకుడు భక్తుల గోత్రనామాలతో అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగాణంలో తులసి కోట వద్ద కార్తికదీపారాధన నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పండితులు స్వామి వారికి లక్షపత్రి పూజ, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పార్థివ లింగార్చన, సూర్యనమస్కారాలు నిర్వహించారు. అనపర్తి మార్కండేయపురంలో వేంచేసి యున్న భావనారుషి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.పెదపూడి మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాల్లో సోమవారం భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. పెదపూడిలో శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి, జి.మామిడాడలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, సంపరలో వీక్షణ ముక్తేశ్వర స్వామి, రామేశ్వరంలో రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు తెల్లవారు జామునుంచే స్వామి వారిని దర్శించుకున్నారు.


చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి


బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి


భావనారుషి ఆలయంలో అలంకరణలో స్వామి


అనపర్తి రామలింగేశ్వర ఆలయంలో పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు